# అద్దమూ, ముసుగూ

శ్పానిష్ : జార్జ్ లూయిస్ బోర్హెస్
ఆంగ్లం : నార్మన్ థామస్‌డిగియాన్న
తెలుగు : కె. సదాశివరావు

క్లోంటార్ఫ్ యుద్ధం ముగిసింది. అందులో నార్వే దేశస్తులు ఓడిపోయారు. ఐర్లండ్ మహారాజు తన ఆస్థానకవితో ఇలా అన్నాడు.

"ఎంత గొప్ప కార్యాలయినా మాటల నాణాలలోనికి మార్చకపోతే తమ తేజస్సుని కోల్పోతాయి. మీరు మా ఘన విజయాల్నీ, మా ఘనతనీ గానించండి. మేము ఎయినాస్ అవుతాము. మీరు మాకు వర్జిల్ మహాకవి కావాలి. మన మిద్దరం కలకాలం జీవించేలా చేసే ఈ మహత్తర కార్యాన్ని చేపట్టగలిగే సమర్థత మీకు వున్నదనుకోమంటారా?"

"తప్పకుండా ప్రభూ" అన్నాడు కవి. "నా పేరు ఒలాన్. నేను పన్నెండు హేమంతాల కాలంగా ఛందోబద్ధ విషయాలతో సుశిక్షితుడనైనాను. మూడు వందల అరవై గాథలు, కథలూ నాకు కంఠతా వచ్చు. నిజమైన కవిత్వానికి మూలాధారాలైన అల్‌స్టర్, మన్‌స్టర్ చక్రభ్రమణాలను నా వీణా తంత్రుల్లో బంధించాను. మన మాతృభాషలోని అతి ప్రాచీనమైన పదాలను, అతి క్లిష్టమైన ప్రతీకలుగా ప్రయోగించటానికి వ్యాకరణ న్యాయ సూత్రాల అనుమతి నాకు వున్నది. రచనా పద్ధతులలోని రహస్యాలలో నేను నిష్ణాతుడనైనాను. వాటిని సామాన్య జన సమూహపు, విచక్షణా రహిత దృష్టినుండి రక్షించటంలో నేను ప్రావీణ్యత సంపాదించాను. ప్రేమగాథలనూ, పశువుల దొంగతనాలనూ, నౌకా ప్రయాణాలనూ యుద్ధాలను నేను స్తుతించగలను. ఐర్లండ్ దేశంలోని అన్ని రాజవంశీయుల పుట్టుపూర్వోత్తరాలూ, పురాణాలు, ఇతిహాసాలూ నాకు బాగా తెలుసు. న్యాయబద్ధమైన



...్యతిష శాస్త్రము, గణితమూ, దైవ న్యాయాలూ, వృక్షాల శక్తియుక్తులూ, వీటన్నింటి గురించిన విజ్ఞానం నా వద్ద వున్నది. నేను నా ప్రత్యర్థులను బహిరంగ పోటీలలో ఓడించాను. వ్యంగ్య భాషణలో నేను చతురుడను. నా చాతుర్యంతో కుష్ఠు రోగంతో సహా చర్మవ్యాధులను వచ్చేలా చేయగలను. ఖడ్గాన్ని ఎలా ప్రయోగించాలో నాకు తెలుసు. ఇటీవల తమరు గెలిచిన యుద్ధంలో నా ప్రావీణ్యాన్ని చూపించాను. నాకు తెలియని విషయం ఒక్కటే. తమరు నాకు ప్రసాదించిన ఈ అపురూపమైన బహుమతికి ఎలా ధన్యవాదాలు తెలుపుకోవాలో అన్నది మాత్రమే"

సుదీర్ఘ ఉపన్యాసాలంటే అందులోనూ ఇతరులు ఇచ్చే వాటితో విసుగు చెందిన మహారాజు ఉపశమనంతో అన్నాడు.

"మాకు ఈ విషయాలు బాగా తెలుసు. ఇటీవల ఇంగ్లండ్‌లో కోయిల పాడిందని విన్నాము. వర్షాలు, హిమపాతాలూ వచ్చి వెళ్ళాక కోయిల దాని ఉత్తర దిశ ప్రయాణాలనుండి తిరిగి వచ్చినప్పుడు మీరు మీ కవితాగానాన్ని మా నిండు కొలువులో అందరు కవుల సన్నిధిలో వినిపించాలి. మేము మీకు ఓ సంవత్సర కాలాన్ని ప్రసాదిస్తున్నాము. ప్రతి అక్షరాన్నీ, ప్రతి పదాన్ని మీరు మిలమిల మెరిసేలా సానపెట్టాలి. మీకు ఇప్పటికే అర్థమైనట్లుగా మేమిచ్చే బహుమతి మా రాచమర్యాదకీ, మీ నిద్రారహిత రాత్రుల శ్రమకీ ఏమాత్రం తగనట్లుగా వుండదని మేము హామీ ఇస్తున్నాము."

"ఓ ప్రభూ! తమ సుందర ముఖారవిందాన్ని తిలకించడం కన్నా మించిన బహుమతి నాకేమి వుంటుంది." అన్నాడు కవి. ఇతడు మంచి వందిమాగధుడు కూడా.

అతడు తలవంచి వెనుకకు వెళ్ళిపోయాడు. అప్పటికే ఒకటో రెండో కవితలు అతడి కళ్ళముందు కదలాడుతున్నాయి.

సంవత్సరం గడిచేనాటికి - అది రోగాల కాలం, రాజ్యమంతటా తిరుగుబాట్లు - కవి తమ స్తోత్రకావ్యాన్ని పూర్తి చేసి సభలో సమర్పించాడు. అతడు దానిని మెల్లగా పఠించాడు - ధైర్యంగా రాతప్రతికేసి కన్నెత్తి చూడకుండా, మహారాజు తమ తలని ఆడిస్తూ ఆమోదం తెలిపారు. అందరూ ఆ భంగిమని అనుకరించారు. ద్వారాల వద్ద గుమిగూడిన సేవకులు కూడా వారికి వొక్క ముక్క అర్థం కాకపోయినా, చివరకు మహారాజు మాట్లాడారు.

"మీ శ్రమఫలితాన్ని మేము ఆమోదిస్తున్నాము" అన్నారు మహారాజు. "ఇది మరో విజయం మాకు మీరు ప్రతిపదానికి అసలైన అర్థాన్ని ఇచ్చారు. ప్రాచీన కవుల్లా ప్రతి నామవాచకానికి సరియైన సార్థకనామాన్ని ఇచ్చారు. ప్రాచీన సాహితీ రంగంలో లేని భావం లేనే లేదు మీ కావ్యరాజంలో. మానవులు సృష్టించుకునే అందమైన సాలెగూడు యుద్ధం. ఖడ్గాన్నుండి కారే నీరు రక్తం. సముద్రానికి దేవతలున్నారు. మేఘాలు భవిష్యత్తుని చెబుతాయి. మీరు ప్రాసనీ, అనుప్రాసనీ, స్వరసామ్యాన్నీ, రాశి ప్రమాణాలనీ, చతురోక్తులలోని చిత్రగతులనీ, ఛందో రీతులలోని పలు ప్రయోగాలనీ అత్యంత చాకచక్యంతో వాడారు. ఐర్లండ్ దేశపు సాహిత్యమంతా రూపుమాసిపోయినా - పాపము శమించుగాక! మీ మహాకావ్యపు సాయంతో దానిని మళ్ళీ. పునః సృష్టించవచ్చు. ఏమాత్రం నష్టపోకుండా. ముప్పైమంది వ్రాయసగాళ్ళు ఈ కావ్యాన్ని ఒక్కొక్కరూ పన్నెండుసార్లు తిరుగు ప్రతులు వ్రాయాలి. అప్పుడు ఆవరించిన నిశ్శబ్దంలో మహారాజు మాట్లాడుతునే వున్నారు.

"అంతా సవ్యంగానే జరిగింది. అయినా ఏమీ జరగనట్లే వుంది. మన రక్తనాళాల్లో రక్తం ఇంకా వేగంగా ప్రవహించటం లేదు. మా బాహువులు ధనుర్బాణాలకోసం అర్రులు సాచటం లేదు. ఎవరూ భయంతో పాలిపోవటం లేదు. ఎవరూ రణభేరి మ్రోగించటం లేదు. వైకింగ్ వీరుల నెదుర్కొనటానికి ఎవరూ తమ ఎదుర్రొమ్ము పొంగించటం లేదు. సంవత్సరం పూర్తయ్యేలోగా, మహాకవీ, మీరు వ్రాయబోయే మరో మహాకావ్యానికి నివాళులర్పిస్తాం. మా ఆమోదానికి చిహ్నంగా ఈ రజతంతో చేసిన అద్దాన్ని తమరు తీసుకొనండి."

"నేను ధన్యవాదాలర్పిస్తున్నాను. నాకు అర్థమయింది" అన్నాడు కవి.




ఆకాశంలో తారకలు వాటి కాంతి మార్గాల్లో తిరుగుతున్నాయి. శాక్సన్ అరణ్యాల్లో మరో మారు కోయిల పాడింది. మహాకవి తన నూతన కావ్యపు ప్రతిని తీసుకుని తిరిగి వచ్చాడు. క్రితం కన్నా ఈ గ్రంథం చాలా చిన్నదిగా వుంది. కంఠస్థం చేసినవాడిలా అతడు తనజ్ఞాపకాన్నుండి దానిని చదవలేదు. సహజమైన సంకోచంతో కొన్ని భాగాలను వదిలివేస్తూ - తనకే ఆ భాగాలు అర్థం కానట్లుగా, లేకపోతే వాటిని అశ్లీలభూయిష్ఠం చేయడం ఇష్టపడనట్లుగా, ఈ పద్యభాగం ఎంతో విచిత్రంగా వున్నది. అది యుద్ధాన్ని గురించిన వర్ణన కాదు. అది యుద్ధమే! ఆ యుద్ధ సమయంలో వుండే అల్లకల్లోలంలో ముగ్ధులైన దేవతలూ, ఏకాకి అయినవారూ వొకరితో వొకరు కలబడ్డారు. ఐర్లండ్ దేశపు గ్రామ దేవతలూ, క్షుద్ర దేవతలూ, పెద్ద ఎడ్డారాజుకాలంలో వందేళ్ళ తర్వాత యుద్ధంలో పాల్గొనే వారూ... దాని కార్యరూపం కూడా ఎంతో చిత్రమైనది. అద్వితీయ నామవాచకం అనేకత్వపు క్రియాపదాన్ని పాలించింది. ఉపసర్గల వాడకం సాధారణ ప్రపంచంలో

ఎక్కడా లేనివి. కాఠిన్యమూ, లాలిత్యమూ పడుగుపేకల్లా పెనవేసు కున్నాయి. ప్రతీకలు నిరంకుశంగా వున్నాయి. బహుశా అలా తోచాయేమో!

తన చుట్టూవున్న పండితులతో మహారాజు ఏదో మాటలు మాట్లాడి కవితో ఇలా అన్నాడు. "మీరు మొదట రచించిన గేయకావ్యం ఐర్లండ్ దేశంలో పాడే అన్నీ పాటలకే సముచితమైన సంక్షిప్తగ్రంథం వంటిది. కాని ప్రస్తుత కవిత అంతకు ముందు వచ్చిన వాటినన్నింటినీ అధిగమిస్తుంది. పైగా వాటిని శూన్య సదృశంగా మార్చేస్తుంది... ఆశ్చర్య పరుస్తుంది. జిగేల్మనిపిస్తుంది. అద్భుతంలా తోస్తుంది. అజ్ఞానులు దానిని చదవటానికి అనర్హులు. కాని కొద్దిమంది పండితులకు అలాకాదు. దాని ఏకైక ప్రతిని ఓ దంతపు పెట్టెలో భద్రపరుస్తాము. అటువంటి మహోన్నత గ్రంథాన్ని రచించిన కలం నుండి దానిని మించిపోయే మరో గ్రంథాన్ని మేము ఆశిస్తాము" చిరు నగవుతో అన్నారు వారు.

"మనమందరం ఓ కట్టుకథలో పాత్రలం. అందువల్ల కథల్లో మూడు సంఖ్యకి వున్న ప్రాముఖ్యాన్ని గుర్తుంచు కోవటం మంచిది."

"మాంత్రికుడి మూడు కోరికలూ, త్రయాలూ, ప్రశ్నించారాని త్రిమూర్తులూ ... గొణుక్కున్నాడు కవి ధైర్యంగా.

మహారాజు కొనసాగించారు.

"మా సమ్మతి చిహ్నంగా మీరు ఈ ముసుగుని.. బంగారు కృత్రిమ ముఖాన్ని తీసుకోండి"

"నా అభినందనలు తెలియ జేస్తున్నాను. నాకు అర్థమయింది"

సంవత్సరం గిర్రున తిరిగిపోయింది. కోటని కాపలా కాసే భటులు వస్తున్న కవి పుంగవుడు ఏ గ్రంథాన్ని మోసుకురాకుండా వుండటాన్ని గమనించారు. ఆశ్చర్యంతో మహారాజు అతడికేసి చూశారు. కవి వేరే మనిషిలా వున్నాడు. కాలాన్ని మించిన ఏదో శక్తి అతడి కవళికల్లో ముడతలు తెచ్చి మార్చివేసింది. అతడి నేత్రాలు ఎక్కడో దూరాల్లోకి చూస్తున్నట్లుగా వున్నాయి. లేక అది అంధత్వమో! కవి మహారాజుతో ఏకాంతంగా కొద్దిమాటలు మాట్లాడాలని ప్రాధేయపడ్డాడు. సేవకులు




గదవదిలి వెళ్ళిపోయారు.

"మీరు ఏ కవితనీ వ్రాయనేలేదా?" అడిగారు మహారాజు.

"వ్రాశాను ప్రభూ" విషాదంగా కవి సమాధాన మిచ్చాడు. "కాని ఆ భగవంతుడు నన్ను వ్రాయకుండా ఆపివుండ వలసింది"

"దానిని మీరు చదవగలరా?"

"నాకు అంత ధైర్యం చాలటం లేదు ప్రభూ"

మీకు లేని ధైర్యాన్ని మేము మీకు ప్రసాదిస్తాము" అన్నారు రాజు.

కవి ఆ కవితను చదివాడు, అది ఏక వాక్య కవిత.

గట్టిగా చదవటానికి మనస్కరించక మహాకవీ, మహారాజూ అదేదో అతిరహస్య ప్రార్థనలా, మంత్రంలా, లేక ఘోర అశ్లీలం లా దానిని అనుభవించారు. కవిలాగే రాజు కూడ భయభ్రాంతు లయ్యారు. పాలిపోయిన వారిద్దరూ ఒకరి వంక ఒకరు చూసుకున్నారు.

"మా యవ్వనంలో "అన్నారు రాజు "మేము సూర్యాస్తమయ దిశగా నౌక ప్రయాణం చేశాము. ద్వీపం మీద మేము వెండిరంగు జాగిలాలు బంగారు రంగు సూకరాలకు మరణ ఘాతాల్నివ్వడం చూశాము. మరో ద్వీపం మీద మేము ఇంద్రజాలపు యాపిల్ పళ్ళ సువాసనలతో కడుపు నింపుకున్నాము. మూడో ద్వీపం మీద అగ్ని కుడ్యాల్ని చూశాము. అన్నింటి కన్నా దూరంగా వున్నద్వీపంలో ఆకాశాన్ని అడ్డంగా కోస్తూ వొంగి తేలుతున్న నదీ - ఆ నీటిలో మత్స్యాలు, నౌకలూ ప్రయాణం చేశాయి. ఇవి అద్భుతాలు. కాని ఇవేవీ మీ కవితకి సాటిరావు. ఒక విధంగా ఈ కవిత వాటన్నింటినీ అధిగమిస్తుంది. ఏ మహామాయ మీకీ కవితని ప్రసాదించింది?

"ఉదయాన నాకు అర్థం కాని మాటల్ని ఉచ్ఛరిస్తూ నేను మేలుకున్నాను" అన్నాడు కవి. " ఆ మాటలే ఓ కవిత. నేను ఏదో మహాపాపాన్ని చేశాననుకున్నాను. బహుశా దానిని ఏ దేవుడూ క్షమించడేమో!"

"దానిలో మనమిద్దరమూ పాలు పంచుకున్నాము. కవీంద్రా! గుసగుసగా అన్నారు రాజు "మహా సౌందర్యాన్ని తెలుసుకున్న ఘోర పాపమది. ఈ బహుమతి మనుషులకి నిషిద్ధం. మనమిప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. మేము మీకు ఓ అద్దాన్నీ, బంగారు కృత్రిమ ముఖపు ముసుగునీ బహుమతులుగా ఇచ్చి వున్నాము. ఇది మేము మీకు ఇచ్చే తృతీయ బహుమతి. బహుశా ఇది మా చివరి బహుమతి కూడా"

కవి చేతిలో అతడు ఓ ఖడ్గాన్ని ఉంచాడు. కవి సంగతి మనకి తెలుసు. రాజ ప్రాసాదం బయట అతడు తన ప్రాణాలు తీసుకున్నాడు. కాని మహారాజు మాత్రం ఐర్లండ్ దేశంలో .. ఒక నాటి తన సామ్రాజ్యంలో ఓ బిచ్చగాడిలా తిరుగుతూనే వున్నాడనీ... అతడు ఆ కవితని మళ్ళీ ఉచ్ఛరించనే లేదనీ... ●